
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



సోమశిలలో 61.66 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 61.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23,496 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,06,740
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,620
3 శాతం జీఎస్టీతో	రూ.9,909
నవర (8 గ్రా)	రూ.79,272

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /27.1

జిల్లాలో ఉక్కపోత వాతావరణం సోమవారం ఉంటుందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 55 శాతంగా ఆదివారం నమోదైంది.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ నేడు

నెల్లూరు(పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీకి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. పింఛన్ల నగదును సోమవారం ఉదయం నుంచే పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,05,956 మంది లబ్ధిదారులకు రూ.131.95 కోట్లను అందజేయనున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో వీటిని అందజేసేందుకు డీఆర్‌డీఏ పీడీ నాగ రాజకుమారి చర్యలు చేపట్టారు. కాగా 4215 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించారు. అయితే వీటికి సంబంధించి తిరిగి దరఖాస్తు చేసుకున్న వారందరికీ నగదును అందజేయనున్నారు. దరఖాస్తు చేసుకోని వారికి నగదును పంపిణీ చేయడంలేదు.

పర్యవేక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ఉమ్మడి జిల్లా పరిధిలోని వయోజన విద్యాశాఖలో ఖాళీగా ఉన్న నాలుగు పర్యవేక్షకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో అర్హులైన ఎస్జీటీలు, పీఈటీలు, గ్రేడ్ – 2 భాషా పండితులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులను జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేయనుందని వివరించారు. దరఖాస్తులను వయోజన విద్యాశాఖ కార్యాలయంలో సెప్టెంబర్ ఐదులోపు సమర్పించాలని కోరారు. అభ్యర్థులకు పదేళ్ల ఉద్యోగానుభవం, 45 ఏళ్లలోపు వయస్సు ఉండాలని చెప్పారు. మండల, జిల్లా, రాష్ట్ర లిటరసీ ఆర్గనైజర్ లేదా రిసోర్స్ గ్రూపుల్లో పనిచేసిన అనుభవం గల వారికి ప్రాధాన్యముంటుందని పేర్కొన్నారు. మాస్ కమ్యూనికేషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాజాతాల్లో పనిచేసిన అనుభవం ఉన్న వారు తగిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో జత చేయాలని కోరారు. మౌఖిక పరీక్షకు సెప్టెంబర్ తొమ్మిదిన హాజరుకావాల్సి ఉంటుందని, వివరాలకు 98499 09209, 89191 51149 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వీఆర్ హైస్కూల్ రూపురేఖలు మారాయి



వీఆర్ హైస్కూల్‌ను సందర్శిస్తున్న సతీష్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడు గుండ్రా సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆదివారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థినని చెప్పారు. కార్పొరేట్ వసతులతో పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను బోధిస్తున్నారని కొనియాడారు. దాతలు ముందుకొచ్చి చిన్నారులను దత్తత తీసుకొని వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పాతశాలకు తన వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.

గంధాన్ని దంచేందుకు పోటెత్తిన భక్తులు



ఆత్మకూరు: అనుమసముద్రంపేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఆయన సతీమణి హబీబున్నీసా (దొరసానమ్మ) గంధ మహోత్సవంలో గంధాన్ని దంచేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆదివారం హాజరయ్యారు. సమాధికి గంధాన్ని లేపనం చేయనున్న తరుణంలో ఏఎస్‌పేటలోని ఎస్బీఎస్ ఫయాజ్ అహమ్మద్ నివాసంలో గంధం దంచే కార్యక్రమాన్ని ఈఓ హుస్సేన్‌బాషా ప్రారంభించారు. ఎస్సై సైదులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు. గంధ మహోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి నిర్వహించనున్నామని వక్ఫ్‌బోర్డు ఈఓ హుస్సేన్ తెలిపారు.

సీసీ ఫుటేజీల పరిశీలన

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని హత్య చేస్తే డబ్బే డబ్బు అంటూ కొందరు మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైన కేసులో దర్యాప్తు స్పీడ్‌ను పోలీసులు పెంచారు. వీడియో తీసిన సమయంలో గదిలో ఉన్న వారిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. మరోవైపు ఎమ్మెల్యే నివాస చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారని తెలిసింది.

వైకల్యంపై సదరం కత్తి

- దివ్యాంగులను రోడ్డు పాల్జేసిన కూటమి సర్కార్
- గతేడాది జూన్‌లో 3.17 లక్షల పింఛన్లు
- ప్రస్తుతం 3.05 లక్షలే..

జన్మతః దివ్యాంగులుగా ఈ లోకంలో అడుగు పెట్టిన కొందరు. కాలగతిలో శరీర వైకల్యాలతో పోరాడి మానసికంగా కుంగిపోయిన ఇంకొందరు. శారీరక రుగ్మతలతో మంచానికే పరిమితమైన మరికొందరు. వీరందరూ సమాజం నుంచి కనీస కరుణ, ప్రభుత్వం నుంచి ఆర్థిక ఆసరా ఆశించడం సహజం. సాయం చేయాల్సిన సర్కార్ అందుకు భిన్నంగా వైకల్యం నిరూపించుకోమని క్రూరమైన షరతు విధించింది. బతుకు బండినీడ్చేందుకు కష్టపడుతున్న వారికి మరో కఠిన పరీక్ష పెట్టింది. దయ, జాలి, కరుణ అనే పదాలు పాలకులు తమ నిఘంటువు నుంచి తొలగించారు. ఓట్ల కోసం వాగ్దానాలు చేస్తూ, ఆచరణలో దివ్యాంగుల హక్కులను కత్తిరించి ఈ ప్రభుత్వం అసలైన దుర్మార్గ స్వరూపాన్ని బయటపెట్టుకుంది.

ఈ ఏడాదిలో ఇలా	పింఛన్ల లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లల్లో)
జూలై	3,05,513	132.72
ఆగస్ట్	3,06,337	133.18
సెప్టెంబర్	3,05,956	131.95

పింఛన్ తప్ప వేరే ఆధారం లేని నరసింహులు



నరసింహులు నివాసం ఉంటున్న కమ్యూనిటీ హాల్



గోడు వెళ్లబోసుకుంటున్న నరసింహులు

కోవూరు మండలం వేగూరు దళితవాడకు చెందిన ఈయన పేరు కొత్తగుంట నరసింహులు. సుమారు 15 ఏళ్లగా ఆయన దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. ఆయనకు ఇది తప్ప వేరే ఆధారం లేదు. కష్టపడే శక్తీ లేదు. పింఛన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఉండటానికి నివాసం కూడా లేకపోవడంతో వేగూరు వసంతపురంలో ప్రభుత్వం నిర్మించిన కమ్యూనిటీ హాల్లోనే తలదాచుకుంటూ జీవిస్తున్నారు. వైద్యం కోసం, కడుపు నింపుకోవడానికి ఈ మొత్తమే ఆధారం. అలాంటి వ్యక్తి పింఛన్‌ను కూడా ప్రభుత్వం తొలగించి కడుపు కొట్టింది.

నెల్లూరు (పొగతోట): ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ మొత్తం పెంచుతామన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనర్హత పేరుతో వాటిని తొలగించి రోడ్డు పాల్జేసింది. మరో మనిషి సాయం లేనిదే కదల్లేని బతుకుకు సాయం చేయాల్సిన ప్రభుత్వం 'వైకల్యం నిరూపించుకో' అంటూ సదరం కత్తి పెట్టి వెక్కిరిస్తోంది. కూటమి సర్కార్ చేసిన నిర్వాకానికి దివ్యాంగులు గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు. 15, 20 ఏళ్లగా తీసుకుంటున్న దివ్యాంగుల పింఛన్లను రద్దు చేశారు. పింఛన్లు కోల్పోయి బయోమెట్రిక్ ద్వారా నోటీసులు అందుకున్న లబ్ధిదారులు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులవుతారు. బయోమెట్రిక్ ద్వారా నోటీసులు అందుకోని బాధితులకు ఈ అవకాశం లేదు. ఇలాంటి కఠిన నిర్ణయాలు పెట్టి దివ్యాంగుల జీవితాలతో కూటమి సర్కారు ఆటలాడుకుంటోంది. పింఛన్ నగదుతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా దివ్యాంగులు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పింఛన్లు తొలగించడంతో వీరి పరిస్థితి దయనీయంగా మారింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమై పొందుతున్న పింఛన్లనూ కూటమి సర్కార్ రద్దు చేసింది.

జిల్లాలో 4,215 పింఛన్లకు కోత, 2,208 మందికి తగ్గింపు

దివ్యాంగుల పింఛన్ల నగదు పెంచినట్లే పెంచి పరిశీలన పేరుతో వికలత్వం తక్కువగా ఉందనే సాకు చూపి ఆ భారాన్ని తగ్గించుకునేందుకు కుట్ర పన్నింది. జిల్లాలో 4,215 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించి కోలుకోలేని దెబ్బ కొట్టింది. వీరితో పాటు 1611 దివ్యాంగుల పింఛన్లను వృద్ధాప్య పింఛన్లుగా మార్చేశారు. మంచానికి పరిమితమై లేవలేని స్థితిలో రూ.15 వేల పింఛన్ పొందుతున్న 597 మందికి సాధారణ దివ్యాంగుల పింఛన్లుగా మార్చారు.

ఏడాదిలో 12 వేల పింఛన్లు హుష్

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన 2024 జూన్‌లో 3.17 లక్షల పింఛన్లున్నాయి. ఈ ఏడాది జూలై నాటికి 3.05 లక్షలకు అవి తగ్గాయి. మొత్తంగా ఏడాదిలో నెల నెలా అనేక కారణాలను చూపిస్తూ దాదాపు 12 వేల పింఛన్లను తొలగించింది. గత నెల్లో దివ్యాంగులకు సంబంధించి 4,215 పింఛన్లను ఇలా తొలగించింది. ఇదే సమయంలో గతంలో పింఛన్లు పొందుతున్న భర్తలు మరణించడంతో వారి భార్యలకు ఇస్తామని ప్రకటించి కొందరికే ఇచ్చింది. ఈ విధంగా అటు కోత విధించి.. ఇటు ఇచ్చి లెక్క సమం చేసింది.

పక్షవాత రోగిపై పచ్చపాతం

పక్షవాతంతో దయనీయ దుస్థితిని ఎదుర్కొంటున్న అభాగ్యుడిపై దయ లేకుండా పింఛన్ సొమ్ములో కోత విధించేందుకు కూటమి సర్కార్ సిద్ధపడింది. ఇందుకూరుపేట మండలం గంగపట్నం దళితవాడకు చెందిన మర్లపాటి చార్ముదయ్య కూలీనాలీ చేసుకొని జీవనం సాగించేవారు. పక్షవాతంతో చార్ముదయ్య పదేళ్ల క్రితం మంచాన పడ్డారు. భార్య సాయం లేనిదే కాలకృత్యాలు తీర్చుకోలేని పరిస్థితిలో బతుకీడుస్తోంది. ఏ ఉపాధీ లేని ఆ కుటుంబానికి చార్ముదయ్యకు ఇచ్చే పింఛనే ఆధారం. మందులకే నెలకు ఆరు వేల నుంచి ఏడు వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. గత నెల వరకు పింఛన్ రూపంలో రూ.15 వేలను ఇస్తుండగా, తాజాగా ఈ నెల నుంచి రూ.ఆరు వేలే వస్తాయంటూ ఈయనకు నోటీసులను అందజేశారు. దీంతో తామెలా బతకాలంటూ ఈ దంపతులు లబోదిబోమంటున్నారు.



పక్షవాతంతో మంచానికే పరిమితమైన చార్ముదయ్య



లారీల్లో ఇసుక తరలింపు

తమ్ముళ్ల బరితెగింపు

ప్రకృతి వనరులను కొల్లగొట్టడంలో తెలుగు తమ్ముళ్ల బరితెగింపు హద్దులుదాటుతోంది. వాస్తవానికి ఇసుక తవ్వకాలపై అక్టోబర్ 15 వరకు నిషేధమున్నా, ఇదేమీ వారిని ఆపలేకపోతోంది. అధికారం ఉందనే ధీమాతో చెలరేగిపోతూ పెన్నాలో దర్జాగా రోడ్డును నిర్మించారు. ప్రవాహానికి అది కొట్టుకుపోవడంతో కొద్ది రోజులు మౌనంగా ఉండి.. ఆపై గ్రావెల్, బండ రాళ్లతో పక్కాగా ఏర్పాటు చేసుకొని తమ పనిని కానిచ్చేస్తున్నారు. ఈ రకంగా వ్యవహరిస్తున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.

మళ్లీ ఇసుక దోపిడీ

- పెన్నాలో దర్జాగా రోడ్డు నిర్మాణం
- ప్రవాహానికి కొట్టుకుపోవడంతో కొద్ది రోజులు విరామం
- తాజాగా గ్రావెల్, బండ రాళ్లతో పక్కాగా ఏర్పాటు
- అక్టోబర్ 15 వరకు తవ్వకాలపై నిషేధమున్నా.. ప్రయోజనమేదీ..?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తూ పచ్చ నేతలు చెలరేగిపోతున్నారు. కలువాయి మండలంలో జరుగుతున్న ఈ తంతు వీరి ఆగడాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇక్కడ భూ, ఇసుక, గ్రావెల్ మాఫియా పేట్రేగిపోతోంది. సహజ సంపదను అక్రమంగా రవాణా చేసి కోట్ల రూపాయలను ఆర్జిస్తున్నారు.

పండగ వేళ..

ప్రజలందరూ వినాయక చవితి ఉత్సవాల్లో ఉన్న సమయంలో కలువాయి మండలం రాజుపాళెం సమీపంలోని పెన్నా పరిధిలో ఇసుక మాఫియా తమ పనిని సజావుగా కానిచ్చేందుకు ఏకంగా రోడ్డునే నిర్మించింది. రాపూరు మండలం తెగచర్ల నుంచి భారీగా గ్రావెల్, బండ రాళ్లను ఇక్కడికి తోలి.. పైపులతో దారిని ఏర్పాటు చేయడంపై స్థానికులు భగ్గుమంటున్నారు.

కొద్ది రోజులు నటన

నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో రోడ్డు ఇటీవల కొట్టుకుపోయింది. అయితే మీడియాను పక్కదోవ పట్టించేందుకు పనులను ఆపేసినట్లు.. రెవెన్యూ, మైనింగ్ అధికారులు సీజ్ చేశారనే రీతిలో వ్యవహరించి ఆపై తమ పనులను యథావిధిగా చేపట్టారు. రాజుపాళెంలో అక్రమ రీచ్ ఏర్పాటుకు



పెన్నాలో నిర్మించిన రోడ్డు

ఓ ప్రైవేట్ వ్యక్తి మామిడి తోట నుంచి డీపీ – 1 కాలువను పూడ్చేసి మరీ రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. వీటిని చకచకా చేపట్టడం వెనుక అధికారుల హస్తం ఉందని సమాచారం.

ఆదేశాలు బేఖాతర్

జిల్లాలో ఇసుక రీచ్‌లకు అనుమతులను అక్టోబర్ 15 వరకు అధికారులు రద్దు చేశారు. అయితే వీరి ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రాజుపాళెం రీచ్‌లో అక్రమ రవాణాకు అన్నీ సిద్ధం చేశారు. గ్రావెల్, బండరాళ్లను పట్టపగలు దర్జాగా తోలుతున్నా పట్టించుకోకుండా, రెవెన్యూ, మైనింగ్ పోలీస్, ఇరిగేషన్ శాఖలు అక్రమార్జనలో భాగస్వాములయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల తీరుపై విస్మయం

యంత్రాల ద్వారా కాకుండా కూలీలతో పెన్నా నుంచి ఇసుక పూడికతీత అని అధికారులు టెండర్లు పిలిచి అనుమతులిచ్చారని తెలిసింది. సంగం బ్యారేజీలో పూడికతీత పనులకు టెండర్లను సోమశిలకు దగ్గరగా ఉండే రాజుపాళెంలో ఎలా పిలిచారో అధికారులకే అర్థం కావాలి. ఇసుకను కూలీలే బయటకు తీసి, వాహనాల్లో ఎలా లోడ్ చేస్తారో వారికే ఎరుక. అధికారుల తీరుపై విస్మయం వ్యక్తమవుతోంది.

30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి

నెల్లూరు (టౌన్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించిన మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడారు. ప్రచార యాత్రను ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. పీఆర్సీ, ఐఆర్, డీఏల సాధనకు గానూ ఈ నెల 17 నుంచి 20 వరకు మండల కేంద్రాల్లో.. అక్టోబర్ 7న జిల్లా కేంద్రంలో.. 21న విజయవాడలో ధర్నా ను నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నామని వెల్లడించారు. సమావేశంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, జన విజ్ఞాన వేదిక నేతలు కృష్ణారెడ్డి, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నీ వ్యాఖ్యలను అసహ్యించుకుంటున్న ప్రజలు

- కావలి ఎమ్మెల్యేపై ధ్వజమెత్తిన పేర్నేటి



మాట్లాడుతున్న పేర్నేటి కోటేశ్వరరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈవీఎంలు కలిసొచ్చి గెలిచిన నీవు.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు అసహ్యించుకుంటున్నారంటూ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేర్నేటి కోటేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. కావలిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వెలుగులోకి తీచ్చేందుకు యత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులను బనాయించడం దారుణమని చెప్పారు. ఆయన్ను పరామర్శించేందుకు సంకల్పించిన కాకాణి, పర్వతరెడ్డిపై చేసిన వ్యాఖ్యలు కావ్య వ్యక్తిత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై కృష్ణారెడ్డికి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటన్నారు. మీడియా సమావేశాల్లో ఎలా మాట్లాడాలో తెలియని ఆయన తన నీచపు వ్యక్తిత్వాన్ని బయటపెట్టారని పేర్కొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డికి స్కూళ్లు లేవని, ఉన్నవి కళాశాలలు మాత్రమేననే విషయాన్ని అజ్ఞానైన ఆయన గుర్తుంచుకోవాలని హితవు పలికారు. క్వారీల్లో జరుగుతున్న అక్రమ బ్లాస్టింగ్‌లతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. కావలిలో జరిగిన మనీస్కామ్‌లో కోట్లాది రూపాయలు చేతులు మారాయని తాము చెప్తుంటే, ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా చవకబారు మాటలకు స్వస్తి పలికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు.

ప్రభుత్వ భూములు హాంఫట్

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రభుత్వ భూములను అక్రమార్కులు అన్యాక్రాంతం చేస్తున్నారు. వీటిని చేజిక్కించుకునేందుకు ఎన్నో జిమిక్కులకు పాల్పడుతున్నారు. భూములను చదును చేయడం.. ఆపై జామాయిల్ మొక్కలు నాటడం.. అవి తమదేనంటూ బొక్కేయడం పరిపాటిగా మారింది. మండల, డివిజన్ స్థాయి అధికారులకు స్థానికులు సమాచారమిచ్చినా, వారెలాంటి చర్యలు చేపట్టడంలేదు.

- జామాయిల్ మొక్కలు నాటి.. సొంతం చేసుకుంటున్న కబ్జాదారులు
- అధికారులకు విన్నవించినా స్పందన శూన్యం



ఆక్రమించిన భూమిలో నాటిన జామాయిల్ మొక్కలు

మర్రిపాడు: మర్రిపాడులోని ప్రతి గ్రామంలో వందలెకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. ఇంకేముంది కబ్జాదారుల కన్ను వీటిపై పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీరి ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. మండల పరిధిలోని పెగళ్లపాడు రెవెన్యూలో 82, 83, 84 నుంచి 113 వరకు ఉన్న సర్వే నంబర్లలో దాదాపు వందెకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఉమ్మాయపల్లికి చెందిన కొందరు జామాయిల్ సాగు చేసుకునేందుకు గానూ కొన్ని ఆన్‌లైన్ పట్టాలు.. మరికొన్ని నకిలీ పట్టాలతో వీటిని కబ్జా చేసేందుకు జేసీబీ ద్వారా చెట్లను తొలగిస్తున్నారు. జామాయిల్‌ను వారం రోజులుగా సాగు చేస్తున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదే తరహాలో..

మండలంలోని చుంచులూరు రెవెన్యూ పరిధిలో కొత్తపల్లి పాత రోడ్డును ఆనుకొని తారు రోడ్డు పక్కనే ఉన్న సర్వే నంబర్ 39, 41లో విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరా విలువ రూ.ఐదు లక్షలకుపైగానే ఉంటుంది. రాజకీయ పలుకుబడి ఉన్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ భూమికి పక్కనే కొంత భూమికి అసైన్‌మెంట్ పట్టా పొందారు. తాజాగా దీని పక్కనే ఉన్న సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి జేసీబీలతో ముళ్ల చెట్లను తొలగించి, చదును చేసి జామాయిల్ మొక్కలు నాటారు. విషయం తెలుసుకున్న పక్కనే ఉన్న 42 సర్వే నంబర్ పట్టాదారు.. 50 ఏళ్ల హక్కు అనుభవం కలిగిన రిజిస్టర్ పొలానికి దారి లేకుండా చేయడం అన్యాయమంటూ తహసీల్దార్‌ను ఆశ్రయించారు. మర్రిపాడులో ఇటీవల నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌లో ఆర్డీఓ పావనికు అర్జీని సమర్పించారు.

ఆదేశాలు పెడచెవిన

ఈ క్రమంలో సర్వేయర్లతో సర్వేను మూడు రోజుల క్రితం తహసీల్దార్ చేయించారు. పక్కా నివేదికతో సదరు భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అది ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారించారు. 42 సర్వే నంబర్ గల సెటిల్‌మెంట్ భూమికి ప్రభుత్వ పొలంలో 20 అడుగుల దారిని కొలిచి సదరు రైతుకు ఇచ్చారు. అయితే అక్రమణలకు అలవాటుపడిన కబ్జాదారులు అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతూ ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆదేశాలను ధిక్కరిస్తూ దారి ఇక్కడ లేదంటూ అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం.. చెట్లు నాటి పక్క పొలానికి దారి లేకుండా చేయడం అన్యాయమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఆత్మకూరు ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను సంప్రదించగా, పరిశీలించి చర్యలు చేపడతామని బదులిచ్చారు.

కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వాల కొమ్ము

ఉదయగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీరిని ఆదుకునే అంశాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నారని రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ఆరోపించారు. ఉదయగిరిలో ఆదివారం నిర్వహించిన రైతు కూలీ సంఘ నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు. సాగు ఖర్చులు పెరుగుతున్నా, దానికి తగిన విధంగా గిట్టుబాటు ధరల్లేవని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలకు పేద రైతుల భూములను అప్పగిస్తూ వారిని రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. భూములివ్వమని కరేడులో ఉద్యమం చేస్తున్న వారిని ఇబ్బంది పెడుతూ బలవంతంగా లాక్కుంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని గతంలో వ్యతిరేకించిన చంద్రబాబు, తాజాగా వీటిని అమలు చేయడం దారుణమని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోడే రమణయ్య, రత్నం, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో అంధకారం



ఆత్మకూరు రూరల్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో రాత్రివేళ చీకట్లు నిత్యం అలుముకుంటున్నాయి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతాలకెళ్లే వ్యక్తులు, సమీపంలో టాయిలెట్లకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విషయమై డిపో మేనేజర్‌ను సంప్రదించేందుకు యత్నించగా, అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

యువకులను రక్షించిన పోలీసులు



గజ ఈతగాళ్లు, సిబ్బందితో ఎస్సై నరేష్

విడవలూరు: వినాయక నిమజ్జనానికి విచ్చేసిన యువకులు సముద్రంలో మునిగిపోతుండగా పోలీసులు కాపాడారు. మండలంలోని రామ తీర్థం తీరానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. బుచ్చిరెడ్డిపాళెం సీఐ సురేంద్రబాబు స్థానిక ఎస్సై పి.నరేష్ తీరం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రంలో మునిగిపోతున్న నలుగురు యువకులను గజ ఈతగాళ్లు రక్షించి ఒడ్డుకు చేర్చారు.

ఫోన్‌పే చేయించుకుంటే.. బ్యాలెన్స్ మైనస్‌లోకి..

- ఏటీఎం వద్ద మోసపోయిన వ్యక్తి

నెల్లూరు(అర్బన్): ఓ వ్యక్తి ఫోన్‌పేలో నగదు వేయించుకున్నాడు. ఆ తర్వాత అతని బ్యాంక్ ఖాతాలో బ్యాలెన్స్ మైనస్‌లోకి వెళ్లింది. వివరాలిలా ఉన్నాయి. గత నెల 28వ తేదీ సాయంత్రం భక్తవత్సలనగర్‌కు చెందిన సిద్దాని శ్రీనివాసులు రూ.25 వేల నగదును సీడీఎం (క్యాష్ డిపాజిట్ మెషీన్) ద్వారా తన ఖాతాలో వేసేందుకు ఏటీఎంకు వెళ్లాడు. అక్కడ రద్దీగా ఉంది. ఓ వ్యక్తి తనకు రూ.25 వేలు ఇస్తే ఆ మొత్తాన్ని ఫోన్‌పే చేస్తానని చెప్పగా శ్రీనివాసులు అంగీకరించాడు. కాసేపటికి ఫోన్‌పే ద్వారా నగదు జమైనట్లు అతను చూపించగా శ్రీనివాసులు రూ.25 వేలను అందజేశాడు. కాసేపటికి శ్రీనివాసులు ఎల్‌ఐసీ ప్రీమియాన్ని ఫోన్‌పే ద్వారా చెల్లించగా బ్యాలెన్స్ రూ.19,800గా చూపింది. అనంతరం దుస్తుల దుకాణానికి వెళ్లి బ్యాలెన్స్ చూడగా మైనస్ రూ.5,800 చూపించింది. దీంతో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా శ్రీనివాసులు ఖాతాను హోల్డ్‌లో పెట్టారని సమాధానం వచ్చింది. పక్కరోజు ఉదయం తన అకౌంట్ ఉన్న రమేష్ రెడ్డి నగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌ను కలిశాడు. ఆయన పరిశీలించి కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి మీకు రూ.25 వేలు వచ్చినట్లు ఫిర్యాదు ఇచ్చినందున ఖాతాను హోల్డ్‌లో పెట్టారని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో అదేరోజు శ్రీనివాసులు ఎస్పీ కార్యాలయంలో సైబర్ క్రైమ్ సిబ్బంది వద్దకు వెళ్లారు. కర్ణాటకకు చెందిన వ్యక్తి మీ మీదే ఫిర్యాదు ఇచ్చినందున తాము స్వీకరించలేమన్నారు. దీంతో శ్రీనివాసులు ఏటీఎం సీసీ కెమెరా ఫుటేజీ చూసి సదరు వ్యక్తిని పట్టుకోవాలని కోరాడు. మీలా ఇప్పటికే 10 మంది వరకు మోసపోయినట్టు సిబ్బంది చెప్పారు. వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అతను అక్కడికెళ్లగా కంప్లైంట్ మీ ఖాతాపైనే చేసినందున ఏమీ చేయలేమన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ దేశాన్ని నియంతృత్వం వైపు నడిపిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం లౌకిక ప్రజాతంత్ర వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజలందరూ ఐక్యంగా పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని బీజేపీ కాలరాస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డా.రాజేశ్వరరావు, విశ్రాంత తహసీల్దార్ రవీంద్రబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకుడు పరంధామయ్య, చలనం సామాజిక సంస్థ కార్యదర్శి జాషువా, సంఘమిత్ర కరస్పాండెంట్ రవీంద్రారెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షుడు అంకయ్య, చైతన్య జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం బాలసుబ్రహ్మణ్యం కన్వీనర్‌గా 20 మందితో లౌకిక ప్రజాస్వామ్య వేదిక తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మూలం రమేష్, అరిగెల నాగేంద్ర సాయి, రాంబాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.242
లేయర్ చికెన్:	రూ.210

క్షణం ఆలోచిస్తే.. నిలుస్తుంది ప్రాణం

- కలవరపెడుతున్న బలవన్మరణాలు
- ఈ ఏడాదిలో 61 మందికి పైగా..
- 16 నుంచి 40 ఏళ్ల వయసున్న వారే అధికం

నెల్లూరు(క్రైమ్): జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక చిన్నచిన్న సమస్యలకూ కుంగిపోతూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఎన్నెన్నో బంధాలను పెనవేసుకున్నా.. అన్నింటిని తుంచేసుకుని నా అనుకున్న వారిని నట్టేట వదిలేసి అనంతలోకాలకు వెళ్లిపోతున్నారు. జిల్లాలో పెరుగుతున్న బలవన్మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవన వేగం జోరందుకోవడంతోపాటు అంతే స్పీడుగా ప్రజల్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. కుటుంబ సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, అనారోగ్యం, ఉద్యోగం రాలేదని, రుణ, ఆర్థిక ఇబ్బందులు, వ్యసనాలు, ఒత్తిడి ఇలా రకరకాల కారణాలతో పలువురు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిదిమేస్తున్నాయి. ఆలోచన శక్తి కలిగి ఉండి తనకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారమార్గాలు కనుగొనే అవకాశం ఉన్నా చిన్నచిన్న విషయాలకే మనోధైర్యాన్ని కోల్పోతూ ప్రాణాలు తీసుకుంటూ కుటుంబ సభ్యులకు అంతులేని ఆవేదన మిగులుస్తున్నారు. కొన్ని కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి చిన్నాభిన్నమవుతుంటే.. మరికొన్ని ఇళ్లలో చేతికందొచ్చిన కొడుకు తనువు చాలించి పోషణ కరువవడం, మరోచోట భర్తను కోల్పోయి భార్యాపిల్లలు అనాథలవడం, అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు చదువుల్లో ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడటం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి.



వందేభారత్ రైల్లో చిక్కుకుపోయిన మృతదేహం (ఫైల్)

గుర్తుచేసుకుని..

సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి ఆత్మహత్యలకు పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తుచేసుకుని క్షణంపాటు ఆలోచించినా జీవితాన్ని అలవోకగా జయించవచ్చని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 61 మందికిపైగా ఆత్మహత్యలు చేసుకున్నారు. బలవన్మరణానికి పాల్పడుతున్న వారిలో 16 నుంచి 40 ఏళ్లలోపు వయసున్న వారే ఎక్కువగా ఉన్నారు.

ఇటీవల కొన్ని ఘటనలు

- బుజబుజనెల్లూరు వల్లూరమ్మకాలనీకి చెందిన ఓ వృద్ధుడు అప్పులపాలై ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు.
- గుర్తుతెలియని వ్యక్తి వందేభారత్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- నెల్లూరు డ్రైవర్స్ కాలనీలో అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
- బీవీనగర్‌లో ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకున్నాడు.
- మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.



వినాయక గ్రామోత్సవంలో ఉద్రిక్తత

- డీజేను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుకు అడ్డంగా ఉత్సవ వాహనం
- పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం మజరా టీవీకండ్రిగలో వినాయక గ్రామోత్సవంలో డీజే సౌండ్ సిస్టంకు అనుమతుల్లేవని పోలీసులు ఆదివారం అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిమజ్జనంలో భాగంగా ముందుగా గ్రామంలో ఊరేగింపు ప్రారంభించారు. డీజే ఏర్పాటు చేసి డ్యాన్స్‌లు చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సమయంలో డీజేకు అనుమతి లేదని, స్థానికుల నుంచి ఫిర్యాదు అందిందంటూ ఎస్సై నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. అన్ని చోట్లా ఉత్సవాల్లో డీజే పెట్టారని, మా గ్రామంలో ఎటువంటి సమస్య లేకుండా ప్రశాంతంగా ఉత్సవం జరుగుతుంటే ఎందుకు అడ్డుకున్నారని గ్రామస్తులు పోలీసులను నిలదీశారు. ఫిర్యాదు ఎవరు చేశారో చెప్పాలని కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.



ఉత్సవం వద్ద గుమిగూడిన గ్రామస్తులు



గ్రామంలో ఉన్న పోలీసులు

మహిళల నినాదాలు

పోలీసుల తీరుపై ఆగ్రహించిన ప్రజలు డీజే లేనిదే ఉత్సవం జరగదని భీష్మించారు. ఉత్సవ వాహనాన్ని రోడ్డుకు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ మహిళలు నినాదాలు చేశారు. నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించినా లెక్కచేయని గ్రామస్తులు తమ నిరసనను అలాగే కొనసాగించారు. పలువురు నాయకులు వచ్చి చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది.

ముగిసిన తెలుగు భాషోత్సవాలు

నెల్లూరు(బృందావనం): గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నెల్లూరు పురమందిరంలో సేవ తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న తెలుగు భాషోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 'తెలుగు సాహిత్య విమర్శ'పై నిర్వహించిన సదస్సు నూతన ఆలోచనలకు నాందిపలికింది. దీనికి ప్రముఖ కవి కొండ్రెడ్డి వేంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రసిద్ధ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విమర్శ రాయడం కష్టతరమైన బాధ్యతగా పేర్కొన్నారు. కీలకోపన్యాసకులు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ నేటి విమర్శపై, పరిశోధనలపై అప్రకటిత ఆంక్షలున్నాయంటూ వివరించారు. ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, ఆచార్య సీహెచ్ సుశీలమ్మ, ఉన్నం జ్యోతివాసు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ కవితశ్రీ తదితరులు తమ భావాలను కూలంకషంగా వ్యక్తీకరించారు. వేంకటేశ్వరరెడ్డి రచించిన మూడు గ్రంథాలను ఆవిష్కరించారు. నెల్లూరు కవి గుడ్లదొన సాయి చంద్రశేఖర్ తొలి కవితా సంపుటి 'నిశ్శబ్ద మాధుర్యం'ను చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు సాహితీవేత్తలను గౌరవ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య కొలకలూరి ఇనాక్, నాగసూరి వేణుగోపాల్, గారపాటి ఉమామహేశ్వరరావు, చలంచర్ల భాస్కరరెడ్డి, డాక్టర్ నాశేశ్వర శంకరం, కుసుమ కుమారి, కె.శోభ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం, కథ, నవల, నాటకం, సినీ సాహిత్య సదస్సు, రాత్రి సమాపనోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన అతిథులు

సింహపురిలో కోలాహలం



నిమజ్జనం చేస్తూ..



గణేష్ ఘాట్ వద్దకు నిమజ్జనానికి తీసుకొచ్చిన గణేష్ విగ్రహాలు



నెల్లూరులో వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. భక్తజనంతో గణేష్ ఘాట్ పులకించింది. వివిధ ప్రాంతాలకు చెందిన విగ్రహాలను ఊరేగిస్తూ తీసుకొచ్చారు. మహిళల కోలాటాలు, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వీక్షిస్తున్న భక్తులు



సందడిగా ఊరేగింపు

మృత్యు తీగలు

- విద్యుదాఘాతానికి గురై వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని ఆరోపణలు

విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. వేర్వేరు మండలాల్లో ఇద్దరు షాక్‌కు గురై తనువు చాలించారు. మృతుల్లో పదేళ్ల చిన్నారి ఉన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలోని కంసాలవీధిలో ఐదో తరగతి చదువుతున్న షేక్ సమీర్ (10) అనే చిన్నారి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కంసాలివీధిలో విద్యుత్ స్తంభం నుంచి గృహ వినియోగం కోసం సర్వీస్ వైర్ లాగి ఉన్నారు. స్తంభం నుంచి ఇంటి వరకు దూరం ఉన్నందున స్థానికులు ఇనుప పైపు ఏర్పాటు చేసుకుని అందుకు సర్వీసు తీగలు లాగి కట్టారు. ఆ పైపునకు విద్యుత్ సరఫరా అయ్యింది. ఆ వైపు వెళ్తున్న సమీర్ దానిని పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బిడ్డ మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇనుప పైపునకు విద్యుత్ సరఫరా అవుతున్న విషయం తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమీర్ మృతదేహం

వరి కోసేందుకు వెళ్లి..

ఇందుకూరుపేట: విద్యుత్ వైరు తగిలి రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తూరు మజారా చట్టివారికండ్రిగలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నెత్రంబాక వెంకటేశ్వర్లు (55) వరి పంటను కోసేందుకు సిద్ధమై పొలంలో తిరుగుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ స్తంభానికి ఉన్న లైన్ తెగి పడిఉంది. ఇది వెంకటేశ్వర్లు గమనించలేదు. అతను విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కాగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణమని స్థానిక రైతులు ఆరోపించారు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)



పొలంలో విగతజీవిగా వెంకటేశ్వర్లు

దైవ, దేశభక్తి సమ్మేళనమే గణేష్ ఉత్సవాలు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నెల్లూరు(బృందావనం): దైవభక్తి, దేశభక్తి సమ్మేళనమే గణేష్ ఉత్సవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న నిమజ్జనోత్సవం పురస్కరించుకుని స్వర్ణాల చెరువు వద్ద ఆదివారం గణేష్‌ఘాట్ గణపతి విగ్రహానికి పూజలు చేసి ఆవిష్కరించారు. తొలుత శ్రీస్వర్ణ లింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ప్రజల్లో ఐక్యత పెంపొందించేందుకు, దేశభక్తిని కలిగించేందుకు, సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు బాలగంగాధర్ తిలక్ సామూహిక గణేష్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన ఆశయాలను అందరూ అనుసరించాలన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాల పండగ సందర్భంగా దేశభక్తి, ధర్మానురక్తి ప్రజలందరి ఆకాంక్షంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నేతలు పి.సురేందర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఇంకా బయ్యా వాసు, పిట్టి సత్యనాగేశ్వరరావు, శ్రీకాంత్, భాస్కరరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద వెంకయ్యనాయుడు

ఎన్టీఏ జిల్లా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(టౌన్): నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఎన్టీఏ జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాటకం తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ చెన్నయ్య, గౌరవాధ్యక్షుడిగా వెంకటరాజు, క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖరరెడ్డి, ఆత్మకూరు ఇన్‌చార్జిగా రహంతుల్లా నియమితులయ్యారు. సమావేశంలో ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులురాజు, నాయకులు వెంకరావు, జయప్రకాష్ నాయుడు, రెడ్డి రమేష్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రఫీ, సురేష్, హరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

